క్లుప్తంగా

కరాటేతో మానసికోల్లాసం



ఏటూరునాగారం: కరాటేతో విద్యార్థులకు మానసికోల్లాసం కలుగుతుందని కరాటే మాస్టర్ హుస్సేన్ అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో ప్రత్యేక కరాటే శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరాటే శిక్షణ ప్రతి బుధవారం పాఠశాలలో ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివరావు, పాల్గొన్నారు.

మేడారం జాతర పనుల్లో నిర్లక్ష్యం



ములుగు: మేడారం మహాజాతర పనుల్లో మొదటి నుంచి నిర్లక్ష్యం జరుగుతూ వస్తుందని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్‌రావు ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాసిరకం పనులతో డబ్బులు దోచుకునే పనులు చేస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వం హయాంలోనైనా నాణ్యమైన పనులు జరిగేలా చూడాలని కోరారు. జరుగుతున్న పనులపై విజిలెన్స్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి జంపాల రవీందర్, బండి నర్సయ్య, వడి సారయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు,

విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ



ములుగు: మండలంలోని మాధవరావుపల్లి కస్తూర్భాగాంధీ విద్యార్థినులకు లర్నింగ్ కర్వ్, భారత్ పెట్రోలియం సంస్థలు సంయుక్తంగా శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. జిల్లాలోని తొమ్మిది కేజీబీవీలో చదువుతున్న 1800 మందికి ప్యాడ్స్ అందించినట్లు సంస్థ సీఈఓ సుబ్బు, డైరెక్టర్ గాయత్రి తెలిపారు. కార్యక్రమంలో టీం సభ్యులు తులసి, కవిత, బీపీసీఎల్ ప్రతినిధి బిశ్వరూప్‌రాయ్, డీలర్ కిరణ్, జీసీడీఓ రమాదేవి, డీడబ్ల్యూఓ ప్రేమలత, డీసీఈబీ సెక్రటరీ విజయమ్మ, ఎంఈఓ శ్రీనివాసులు, క్వాలిటీ కోర్డినేటర్ అర్షం రాజు, సైన్స్ అధికారి జయదేవ్, జీవనప్రియ పాల్గొన్నారు.

సర్పంచ్, పాలకవర్గానికి సన్మానం

మహాముత్తారం: ఐదేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా మండలంలోని ములుగుపల్లి జీపీ కార్యాలయంలో బుధవారం సర్పంచ్ దూలం మల్లయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సర్పంచ్, ఎంపీటీసీలతో పాటు పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు.కార్యక్రమంలో ఎంపీటీసీ పుట్టపాక రాధ ఉపసర్పంచ్ దయ్యాల మీనా, వార్డు సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



టేకుమట్ల: మండలంలోని గర్మిళ్లపల్లి ఉన్నత పాఠశాల 1997–98 పదోతరగతి పూర్వ విద్యార్థి కందుల కొమురయ్య తల్లి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆమె దశదినకర్మ సందర్భంగా మిత్ర బృందం కొమురయ్యను పరామర్శించి, రూ. 20వేలను ఆర్థిక సాయంగా అందించి ఎల్ల వేళలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అందజేసిన వారిలో బాల్య మిత్రులు నల్లబెల్లి రవీందర్, కారుకూరి మారి, సోమిడి లింగమూర్తి, గణేష్, కందుల మహేందర్, కాసగాని రమేష్, భూపతి బిక్షపతి, తోడేటి శంకర్, గీద లోహిత్ రెడ్డి, గాదం సురేష్, రమేష్, ఉన్నారు.

పరామర్శ

రేగొండ(కొత్తపల్లిగోరి): కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక ఎంపీటీసీ జూపాక రమేష్ తల్లి రాజమ్మ ఇటీవలే అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు సాంబారి సాయి కుమార్ పరామర్శించారు. పరామర్శించిన వారిలో నాయకులు రఘుసాల తిరుపతి, వీరేశం, రవికుమార్, ప్రదీప్, ప్రభాకర్, యుగేందర్, లక్ష్మణ్, తదితరులు ఉన్నారు.

ప్రత్యేక పాలనకు 149 మంది కేటాయింపు

● మంగపేటకు పాతవారినే కొనసాగింపు

ఏటూరునాగారం: జిల్లాలోని 9 మండలాల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలన నేటితో ముగిసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని గ్రామ పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించింది. 174 గ్రామపంచాయతీలకు గాను 149 మంది ప్రత్యేక అధికారులను కేటాయిస్తూ జాబితా విడుదల చేసింది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల నుంచి అధికారులను ఎంపిక చేసి గ్రామ పంచాయతీకి ఒక్కో ప్రత్యేక అధికారిని కేటాయించింది. పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారికి చెక్ పవర్‌ను ఇవ్వనుంది. ఏటూరునాగారం ఎంపీడీఓ కుమార్‌ను ప్రత్యేక అధికారిగా కేటాయించారు. గోవిందరావుపేటకు ఎంపీఓగా పనిచేస్తున్న సాజీదాబేగాన్ని ప్రత్యేక అధికారిగా నియమించారు. అలాగే కన్నాయిగూడేనికి గూర్రేవుల ఎడ్యుకేషన్ నుంచి జెడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ స్వరూపను కేటాయించారు. ములుగుకు రెవెన్యూ నుంచి తహసీల్దార్ విజయ భాస్కర్‌ను కేటాయించగా తాడ్వాయికి ఎంపీడీఓ



ఏటూరునాగారం జీపీ కార్యాలయం

సత్యాంజనేయ ప్రసాద్‌ను ప్రత్యేక అధికారి, వెంకటాపురం(ఎం) ఎంపీఓ శ్రీనివాస్‌ను ప్రత్యేక అధికారి, వెంకటాపురం(కె)కు ఎంపీఓ హనుమంతరావును స్పెషల్ ఆఫీసర్‌గా కేటాయించారు. వాజేడు మండల కేంద్రానికి ఇంకా కేటాయించలేదు. అలాగే ఇప్పటికే మంగపేట మండలంలో ప్రత్యేక అధికారులు ఉండగా వారినే కొనసాగిస్తున్నారు. నేటి నుంచి ప్రత్యేక పాలన అమల్లోకి రావడంతో

మండలాలు	జీపీలు
ఏటూరునాగారం	12
గోవిందరావుపేట	18
తాడ్వాయి	18
ములుగు	32
వాజేడు	17
వెంకటాపురం(కె)	18
వెంకటాపురం(ఎం)	23
కన్నాయిగూడెం	11
మంగపేట	25

గ్రామంలోని సమస్యలు పరిష్కారం అవుతాయా లేక జఠిలంగా ఉంటాయా అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.

2011 ఆగస్టు నుంచి ప్రత్యేక పాలన కొనసాగుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామ పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు మంగపేట మండలంలో జరగకపోవడం గమనార్హం.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

● జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి

వెంకటాపురం(కె): టెన్త్‌లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరై లక్ష్యాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు ఉదయం , సాయంత్రం ఒక గంట పాటు ప్రత్యేక తరగతుల అమలు ప టిష్టంగా ఉండాలన్నారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రతీ వారం స్లిప్ టెస్టులను నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ,శ్రీనివాస్, సుజాత, రామకోటి, జయరామ్, శ్రీరామ్మూర్తి, శేషగిరిరావు ఉన్నారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించండి

వాజేడు: టెన్త్ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించాలని జిల్లా విద్యా



వాజేడు: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

శాఖ క్వాలిటీ కో ఆర్డినేటర్ బద్దం సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠ శాలలో నిర్వహించిన హిందీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి తమ లక్ష్యాలను చేరుకునేలా విద్యా బోధన చేయాలన్నారు. పరీక్షల పట్ల విద్యార్థులకు ఉన్న భయాన్ని పోగొట్టాలని తెలిపారు. సమావేశంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయుడు ఆనందరావు, డీఆర్‌పీ ఉపాధ్యాయుడు స్వరూప్ సింగ్, జయేందర్‌రావు, వాజేడు, వెంకటాపురం(కె), ఏటూర్‌నాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యాప్రగతికి కృషి చేయాలి

కాళేశ్వరం: ఉపాధ్యాయ సమస్యల సాధన కోసం పోరాటాలు చేస్తూ విద్యాప్రగతికి కృషి చేయాలని పీఆర్‌టీయూ నాయకులు అన్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షురాలు గుబిరే లక్ష్మీ, జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.కరుణశ్రీ, స్థానిక హెచ్ఎం అన్నపూర్ణల ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ తెలంగాణ క్యాలెండర్‌ను పాఠశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భావి సమాజ నిర్మాతలను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వాలు ముందుండాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ



కాళేశ్వరంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

తెలంగాణ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ పెంటి శ్యామ్‌కుమార్, ఉపాధ్యాయులు రామ్మూర్తి, లచ్చయ్య, రాజు, సుధాకర్, అశోక్‌కుమార్, రాజేందర్, శ్రీనివాస్, మణిమాల, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ సిబ్బంది వినూత్న ప్రచారం

రేగొండ : ఉపాధి హామీ పనులకు రావాలని బుధవారం ఉపాధి హామీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి అదనపు ప్రోగ్రాం అధికారి జమీర్‌పాషా ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయని పనులకు వచ్చి సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు ప్రభుత్వం ప్రకటించినందున ప్రజలందరు రావాలని అన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు రాజు, రమేష్,



మహిళలకు బొట్టుపెడుతున్న ఉపాధి హామీ సిబ్బంది

ప్రకాష్, రాజు, రాంబాబు ఫీల్డ్ అసిస్టెంట్‌లు సుజాత, చిరంజీవి, శ్యామ్, రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ వేణుచందర్

చిట్యాల: వాహనాదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని సీఐ దాసారపు వేణుచందర్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో జీపు, ఆటో, ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించాలని, సెల్‌ఫోన్ మాట్లాడకూడదని అన్నారు. రోడ్డుపైన వాహనాలను నిలుపరాదని అన్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొట్టి మీ జీవితాలను నాశనం చేసుకోకూడదని తెలిపారు. డ్రైవర్లు మత్తు పదార్థాలు సేవించి వాహనాలను నడపరాదని హెచ్చరించారు. మూలమలుపు వద్ద వాహనాలను జాగ్రత్తగా నడుపుకోవాలని కోరారు. ప్రయాణికులను సురక్షితంగా తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై జంగిలి రమేష్, సిబ్బంది లాల్‌సింగ్ , లింగన్న, డ్రైవర్లు పాల్గొన్నారు.

రైతుల చేనుకు దారేది !

కాళేశ్వరం: గత వారం రోజులుగా రైతులు చేనుకు వెళ్లడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరం పరిధిలోని ఇప్పలబోరులోని ఇసుక క్వారీ వద్ద ఓ రైతుకు చెందిన పంట చేనులో టీఎస్ఎండీసీ అధికారులు మోకాలు లోతు గొయ్యి చేను పొడవునా తవ్వారు. దీంతో ఆయా సమీపంలోని రైతులు తమ పంట చేనులోకి వెళ్లడానికి దారి లేకుండా పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి గొయ్యిని చదును చేసి రైతులకు దారి ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో ధర్నాకు దిగడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిసింది.



రైతుల చేనులో దారికి అడ్డంగా గోతి తీసిన టీఎస్ఎండీసీ అధికారులు

ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన

చిట్యాల: మండలంలోని చల్లగరిగ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల ప్రక్రియపై ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులచే మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల్లో 15 మంది విద్యార్థులు పోటీ చేయగా 102 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా గోవింద సత్యనారాయణ, పచ్చిక భగవాన్‌రెడ్డి, బండి శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రె మంజుల అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు జంపయ్య,



అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి

సమ్మయ్య, రహీం పాషా, లక్ష్మీపతి, సుధాకర్, స్వరూప, శ్రీదేవి, గీత, తదితరులు పాల్గొన్నారు.

మానవహక్కుల రక్షణ అందరి బాధ్యత

టేకుమట్ల: మానవహక్కుల రక్షణ అందరి బాధ్యత అని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గుమ్మడవెల్లిలో సర్పంచ్ ఆకినపల్లి సంధ్య అధ్యక్షతన పౌర హక్కుల రక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అందరూ



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

సమానమేనని, కులమతాలు, వర్గ విభేదాలను చూపరాదని, ప్రతీ ఒక్కరూ సమానత్వంతో కలిసి ఉండాలన్నారు. అగ్ర వర్ణాల వారు నిమ్నవర్గాల వారిని చిన్నచూపు చూడకూడదని, కులాల పేరుతో దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సూచించారు. రాజ్యాంగం ద్వారా ఏర్పడ్డ రిజర్వేషన్లను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్, పంచాయతీ కార్యదర్శి వేణు, హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ మహేందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకెళ్తేనే అభివృద్ధి

● ఎంపీపీ పంతకాని సమ్మయ్య
● మండల సర్వసభ్య సమావేశం

కాటారం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్తేనే మండల అభివృద్ధి సాధ్యపడుతుందని ఎంపీపీ పంతకాని సమ్మయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సమ్మయ్య అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించగా సభ్యులు ప్రశ్నలు లేవనెత్తారు. చింతకానిలో చెక్‌డ్యాం నిర్మాణం అసంపూర్తిగా, నాణ్యత లేకుండా ఉందని పూర్తి చేయకుండానే బిల్లులు ఎలా చెల్లించారని ఎంపీటీసీ ఉడుముల విజయారెడ్డి ఇరిగేషన్ అధికారులను ప్రశ్నించారు. అటవీశాఖ అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండల సమావేశానికి సంబంధిత శాఖ ఉన్నతాధికారులు హాజరకాకపోవడంపై ఎంపీటీసీ జాడి మహేశ్వరీ, కోఆప్షన్ సభ్యుడు అజీజ్



సర్పంచ్‌లను సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, ఎంపీటీసీలు

ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతాపగిరిగుట్టపై జరిగే జాతర అభివృద్ధి పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో కనీస సౌకర్యాలు లేక భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఆరోపించారు. అధికారుల కారణంగా ప్రభుత్వం కేటాయించిన నిధులు వినియోగంలోకి రాలేదన్నారు. అటవీశాఖ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను ఎందుకు భాగస్వామ్యం చేయడం లేదని ఎంపీపీ ఆ శాఖ అధికారులను ప్రశ్నించారు. తీరుమార్చుకోకుంటే కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం సర్పంచ్, పాలకవర్గం పదవీకాలం ముగియడంతో సమావేశంలో సర్పంచ్‌లను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్ నాయక్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు తెప్పెల దేవందర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మహేశ్ రవీందర్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



మల్హర్ : గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ 711 భూపాలపల్లి జిల్లా యూనియన్ సభ్యులు మండలంలోని తాడిచర్ల జూనియర్ కళాశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ సభ్యులు మాట్లాడుతూ గెజిటెడ్ లెక్చరర్స్ సమస్యల పరిష్కారం దిశగా కళాశాలల అభ్యున్నతికి తమ సంఘం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దుప్పటి ప్రవీణ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ రవీందర్, జిల్లా మహిళా కార్యదర్శి స్వరూపరాణి, సభ్యులు నరేందర్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

ఉన్నత చదువులు చదివితేనే గౌరవం

భూపాలపల్లి రూరల్: ఉన్నత చదువులు చదివితేనే ఉన్నతమైన గౌరవం లభిస్తుందని ప్రముఖ సైకాలజిస్టు కెరీర్ కౌన్సిలర్ సుధీర్ సంద్రా విద్యార్థులకు సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో టెన్త్ విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుధీర్ సంద్రా మాట్లాడుతూ ఎంత డబ్బు సంపాదించినా వారికి ప్రజల్లో ఎలాంటి గౌరవం ఉండదన్నారు.పరీక్షలంటే భయం ఉండాలంటే ప్రాక్టీస్ ప్రధానమైందన్నారు. కార్యక్రమంలో మెటా మైండ్ చైర్మెన్ మనోజ్ కుమార్, ట్రెయినర్స్ సదానందం, స్థానికులు పృథ్వీ, శ్రీనివాసాచారి, జర్నలిస్టు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలికంగా పత్తి కొనుగోళ్లు నిలిపివేత

కాటారం: స్థానిక వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రుద్ర జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం ద్వారా గురువారం నుంచి పత్తి కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పెండ్యాల మమత, కార్యదర్శి లా షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిన్నింగ్ మిల్లులో పత్తి నిల్వలు పెరిగిపోవడంతో పత్తి దిగుమతి చేసుకునేందుకు ఖాళీ స్థలం లేనందున సీసీఐ సెంటర్ ఇన్‌చార్జ్ లేఖ ప్రకారం తాత్కాలికంగా కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. తిరిగి కొనుగోలు తేదీని ప్రకటించే వరకు కొనుగోళ్లు జరగవని వారు తెలిపారు.

జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలి

మల్హర్: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ 126వ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆల్ ఎంప్లాయిస్ సొసైటీ కాళేశ్వరం జోన్ అధ్యక్షుడు చింతలపల్లి కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. మండలంలోని తాడిచర్ల జిల్లా పరిషత్ పాఠశాల, జూనియర్ కళాశాలలో జయంతి ఉత్సావాల ఆహ్వాన కరపత్రాలను, ఉపాధ్యాయులు, అధ్యాపకులతో కలిసి బుధవారం ఆయన అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రమాబాయి ఉత్సవాలను పురష్కరించుకొని ఆల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సొసైటీ 542 (ఏఈడబ్ల్యూస్) జాతీయ అధ్యక్షురాలు వేముల జ్యోతి, రాష్ట్ర అధ్యక్షుడు లింగమల్ల ఆదేశాల మేరకు మండలంలో కొయ్యూరు కమ్యూనిటీ హాల్‌లో ఫిబ్రవరి 11న రమాబాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. మంథని, కాటారం డివిజన్ల నుంచి ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, అంబేడ్కర్ వాదులు, విద్యార్థులు, మేధావులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు బండి సుధాకర్, హెచ్ఎం మల్క భాస్కర్‌రావు, కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ దుప్పటి ప్రవీణ్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కుమార్‌యాదవ్

అధికారులు గ్రామాలను సందర్శించాలి

పలిమెల : సర్పంచ్‌ల పదవీ కాలం జనవరి 31తో ముగిసినందున గురువారం నుంచి గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాలను సందర్శించి జీపీ ఆస్తులను చూసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో నిర్వహించిన వీక్లి రివ్యూ మీటింగ్‌లో ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, గ్రామాల్లో చేపట్టిన శానిటేషన్ పనులను పర్యవేక్షించాలని సూచించారు. అలాగే ఉపాధి పనుల్లో భాగంగా ప్రతి పంచాయతీలో ఉపాధి కూలీలకు వంద రోజులు తగ్గకుండా పని కల్పించాలన్నారు. సమావేశంలో మండల పంచాయతీ అధికారి ప్రకాష్‌రెడ్డి, ఈసీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆందోళన

కాటారం: మండలంలోని చల్లపల్లి సమీపంలోని రుద్ర జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రం ద్వారా పత్తి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. కాటారం-మంథని ప్రధాన రహదారిపై పత్తి లోడ్ వాహనాలతో సహా బైఠాయించి నిరసన తెలిపారు. పత్తి కొనుగోళ్లలో జాప్యం వహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. సీసీఐ అధికారులు తేమ పేరిట లేనిపోని నిబంధనలు విధించి అడ్డగోలుగా కోత విధిస్తుండటంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ ద్వారా కొనుగోళ్లు నిలిపి వేస్తామని అధికారులు తెలుపుతున్నారని ఇప్పటికీ ఇంకా పత్తి చేలలో అలానే ఉండిపోయిందని రైతులు పేర్కొన్నారు. సీసీఐ కొనుగోళ్లు నిలిపివేస్తే మద్దతు ధర అందక తమకు నష్టం జరుగుతుందన్నారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న సీసీఐ సెంటర్ ఇన్‌చార్జ్ అభయ్‌ప్రతాప్ సింగ్, ఏఎంసీ కార్యదర్శి లా షరీఫ్ రైతుల వద్దకు చేరుకొని వారితో మాట్లాడారు. బుధవారం సాయంత్రం వరకు రైతులు కేంద్రానికి తీసుకొచ్చిన పత్తిని కొనుగోలు చేస్తామని ఆందోళన చెందవద్దని తెలిపారు. దీంతో రైతులు తమ ఆందోళన విరమించారు.



కాటారం-మంథని రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

సైన్‌బోర్డులు కనిపించకుండా బోర్డులు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా అమ్మవార్లను దర్శించుకునేందుకు ఏటూరునాగారం మీదుగా తాడ్వాయి నుంచి భక్తులు మేడారం వెళ్తుంటారు. తాడ్వాయి నుంచి మేడారం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లకు భక్తులకు సూచికగా, ప్రమాదాలు జరగకుండా ఆర్అండ్‌బీ అధ్వర్యంలో రేడియం సైన్ బోర్డులు, పెయింటింగ్ వేశారు. కాగా ఈ సైన్ బోర్డులు, పెయింటింగ్ ఉన్న ప్రతి చెట్టుకు టార్మాక్ అనే ప్రైవేట్ సంస్థ వారి ప్రకటనల బోర్డులను ఏర్పాటు చేసింది. దీంతో సైన్స్‌బోర్డులు కనిపించకుండా ఉండి ప్రమాదాలు ఆస్కారం ఉంది. వెంటనే అధికారులు వాటిని తొలగించాలని భక్తులు కోరుతున్నారు.



సైన్ బోర్డు ఉన్న చెట్టు ఏర్పాటు చేసిన టార్మాక్ ప్రకటన బోర్డులు